RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 23 ఆదివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 200 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా
NALGONDA | SUNDAY AUGUST 23 2026 | VOL:16 | ISSUE: 200 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# తెలంగాణలో విద్యా, పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

### యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్ చర్చలు

### హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు అంగీకారం


**హైదరాబాద్,ఆగస్ట్22 :**

తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు



నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న

### లంకెబిందెల కోసం తవ్వుతున్నారేమో..
### సెక్రటేరియట్ ముందు భారీ గుంతపై కేటీఆర్ సెటైర్స్



హైదరాబాద్‌లోని రోడ్ల దుస్థితికి సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఏకంగా తెలంగాణ సచివాలయం ముందే పెద్ద గుంత తవ్వి అలాగే వదిలేయడంపై ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారీ గుంతను చూపిస్తూ ట్విట్టర్ (ఎక్స్)లో చేసిన పోస్టుపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టుపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. శివ అనే నెటిజన్ తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో సచివాలయం ముందు ఉన్న భారీ గుంత గురించి వీడియో తీసి పెట్టాడు. సెక్రటేరియట్ ముందే ఇంత పెద్ద గుంత ఉంది. ఎవరైనా సెక్రటేరియట్ చూసుకుంటూ వస్తే ఈ గుంతలో పడి ఛస్తారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంతమంది పోలీసులు వెళ్తుంటారు. ఇంతమంది

(మిగతా 2వ పేజీలో..)

## మంత్రి కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం?

### కుమార్తె వ్యాఖ్యల వివాదమే ప్రధాన కారణం

### సురేఖను తప్పించాలని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్

### సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక తుది నిర్ణయం

తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేటు వేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధమైనట్లు

(మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా?.. రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్

### విద్యార్థులపై పోలీసుల చర్యలపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన కేటీఆర్, కవిత

### ఢిల్లీలో ధర్నా చేసి, తెలంగాణ ఘటనలపై స్పందించకపోవడం ద్వంద్వ వైఖరి అని విమర్శ

### రేవంత్ రెడ్డి ఇంటి వద్ద రాహుల్ ధర్నా చేయగలరా అని కేటీఆర్ నిలదీత

తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల చర్యల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత

(మిగతా 2వ పేజీలో..)



## గచ్చిబౌలిలో కూలిన భవనం..ఇద్దరు మృతి

హైదరాబాద్ : గచ్చిబౌలిలోని అంజయ్య నగర్లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. భవనం శిథిలాల నుంచి ఇద్దరి మృతదేహాలను వెలికి తీసినట్లు పేర్కొన్నారు. మరొకరికి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరికొందరు వర్కర్లు, స్థానికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. భారీ భవనం కావడంతో.. శిథిలాలను తొలగించేందుకు సమయం పడుతుందని, రెస్క్యూ పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని క్షేమంగా



బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో

(మిగతా 2వ పేజీలో..)

## గచ్చిబౌలి విషాదం.. అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం: హైడ్రా కమిషనర్

### గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్

### అంజయ్యనగర్‌లోని అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చేస్తామని ప్రకటన

### సెట్‌బ్యాక్‌లు లేని భవనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడి

హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ శనివారం ఘటనా





# అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు..

### నెట్‌జీరో గ్రామమే లక్ష్యం.. అలవరం కోడూరులో సీఎం చంద్రబాబు పర్యటన

### పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి

### సౌర విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్ వినియోగం ద్వారా గ్యాస్, కరెంట్ ఆదా

### ఆదర్శంగా నిలుస్తున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక

పర్యావరణ పరిరక్షణను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఇంటింటి ఉద్యమంగా మార్చి, గ్రామాలను స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు 'నెట్‌జీరో' విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించి, పర్యావరణహిత జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. శనివారం 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి

(మిగతా 2వ పేజీలో..)



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# మంత్రి కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం?

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యల వివాదం, పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ మేరకు అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది. కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిని అహంకారిగా అభివర్ణిస్తూ, తెలంగాణ కాంగ్రెస్‌ను 'తెలుగుదేశం కాంగ్రెస్'గా మార్చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు ఇవ్వగా, తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటితో తనకు సంబంధం లేదని ఆమె బదులిచ్చారు. అయితే, కుమార్తె వ్యాఖ్యలను ఖండించకపోవడం, సీఎం పాల్గొన్న కార్యక్రమాలకు గైర్హాజరు కావడం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ పరిణామాల మధ్య, ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం సమావేశమయ్యారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఇలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం వంటి నేతలు మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంతర్గత విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సురేఖపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని అధిష్ఠానం ఇప్పటికే సీఎంకు తెలియజేసింది. సీఎం తిరిగి రాగానే గవర్నర్‌కు సిఫార్సు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం తిరిగి రానున్నారు. ఆయన వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

# తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా?.. రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో విద్యార్థుల కోసం ధర్నా చేసిన రాహుల్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో జరుగుతున్న దాడులపై స్పందించకపోవడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు ఆరోపించారు. శుక్రవారం కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు. "దేశంలో రెండు రకాల భారతాలు ఉన్నాయి. ఒకచోట విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగితే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తారు, ధర్నాలు చేస్తారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణలో విద్యార్థులను ఈడ్చుకెళ్తూ, గొంతు పట్టుకొని హింసిస్తున్నా పట్టించుకోరు. ఢిల్లీ తరహాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తారా? లేక తెలంగాణ విద్యార్థులంటే మీకు లెక్కలేదా?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ కవిత కూడా స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 19న మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పట్టుకున్న వీడియోను ప్రస్తావిస్తూ ఆమె విమర్శలు గుప్పించారు. "ఢిల్లీ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎఫ్ఐఆర్ కోసం వెళ్లిన రాహుల్, తెలంగాణ ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఇక్కడి విద్యార్థులను నేరస్థుల్లా చూస్తున్నారు. ఢిల్లీకి మీ ఆవేశం, తెలంగాణకు మీ మౌనం.. విద్యార్థులు మీ నుంచి ఇంతకంటే మెరుగైన తీరును ఆశిస్తున్నారు" అని కవిత అన్నారు.

# లంకెబిందెల కోసం తవ్వుతున్నారేమో.. సెక్రటేరియట్ ముందు భారీ గుంతపై కేటీఆర్ సెటైర్స్

(మొదటి పేజీ తరువాయి)

జనాలు వెళ్తుంటారు.. అలాంటి చోట ఏంటి గుంతనా అని ప్రశ్నించారు. సీఎం గారూ హుస్సేన్ సాగర్‌ను ఇక్కడ కూడా పెట్టాలని అనుకుంటున్నారా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. రోజూ ఎంతోమంది తిరుగుతుంటారు.. దీన్ని క్లోజ్ చేద్దామన్న రెస్పాన్సిబిలిటీ ఉండదా? జీహెచ్ఎంసీ వాళ్లు రోడ్లపై తిరుగుతూ చూడరా? అస్తమానం ఎవరో ఒకరు కంప్లయింట్ ఇస్తేనే తెలుస్తుందా? అని నిలదీశారు. వీలైనంత తొందరగా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అంతేకాకుండా.. లోపల ఇలాంటివి చాలా ఉన్నాయ్.. లోపల దాచిపెట్టాం అని జీహెచ్ఎంసీ అన్నట్లుగా క్యాప్షన్ పెట్టాడు.

# గచ్చిబౌలి విషాదం.. అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం: హైడ్రా కమిషనర్

(మొదటి పేజీ తరువాయి)

స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. కేవలం 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా, దానిపై అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బిల్డర్ సాజిద్ నిర్మించే భవనాలన్నీ అత్యంత నాసిరకంగా ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నట్లు కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. అంజయ్య నగర్ ప్రాంతంలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారని రంగనాథ్ పేర్కొన్నారు. నాలాలను ఆక్రమించి ఇష్టారాజ్యంగా కట్టడాలు చేపట్టారని, వీటిలో అధిక శాతం ప్రస్తుతం హాస్టళ్లుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఆయా భవనాలను యజమానులు వెంటనే ఖాళీ చేయాలని ఆయన ఆదేశించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన అన్ని భవనాలను కూల్చివేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో విద్యా, పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

(మొదటి పేజీ తరువాయి)

మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంబ్రిడ్జ్ సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు..

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరు గ్రామంలో సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా, గ్రామంలో అమలు చేస్తున్న నెట్‌జీరో కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, మురుగునీటిని ఇంటి వద్దే శుద్ధి చేయడం వంటి పద్ధతుల ద్వారా గ్రామాలను ఎలా ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారో తెలిపారు.

క్షేత్రస్థాయిలో కార్యక్రమాల పరిశీలన

కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు, గ్రామానికి చెందిన జె. మహేశ్వరరావు ఇంటిని సందర్శించారు. మహేశ్వరరావు కుటుంబం చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వంటింటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్ట్ గుంతలో వేసి సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని వారు ముఖ్యమంత్రికి చూపించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, వ్యర్థాల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని వివరించారు. అలాగే, ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని బయటకు వదలకుండా, ఆవరణలోనే నిర్మించిన ఇంకుడు గుంతలోకి మళ్లిస్తున్న విధానాన్ని సీఎం పరిశీలించారు. ఈ 'ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్' వల్ల రోడ్లపై మురుగు నిలవకుండా, దోమల బెడద తగ్గి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని లబ్ధిదారులు తెలిపారు. ప్రభుత్వం 'దీపం' పథకం కింద సిలిండర్లు అందిస్తున్నప్పటికీ, ఇండక్షన్ స్టవ్ వాడకం ద్వారా గ్యాస్‌పై ఆధారాపడటాన్ని తగ్గించుకుంటున్నామన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ద్వారా వచ్చే విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్ నడుపుతుండటంతో కరెంట్ బిల్లు కూడా ఆదా అవుతోందని వివరించారు. ఈ ఆదర్శ విధానాలను పాటిస్తున్న మహేశ్వరరావు కుటుంబాన్ని ముఖ్యమంత్రి అభినందించి, వారితో సెల్ఫీ దిగారు. అలవరం కోడూరులో అమలవుతున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు విస్తరింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# గచ్చిబౌలిలో కూలిన భవనం..ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

మరణించిన ఇద్దరు కార్మికులను మధ్యప్రదేశ్ కు చెందిన ఉమేశ్ కారే (34), మోపత్ (42)లుగా గుర్తించారు. వీరు టైల్స్ పనిచేస్తూ.. కొండాపూర్ లో నివాసం ఉంటున్నారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పరిశీలించారు. భవన యజమాని నాలాను ఆనుకుని భవనం నిర్మించడం ఒక్క తప్పయితే.. 50 గజాల భూమిలో ఏడంస్తుల నిర్మాణం చేపట్టడం మరో తప్పిదంగా గుర్తించారు. అసలు అక్కడ భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చారా ? లేదా ఇష్టానుసారంగా నిర్మించారా? అన్నదానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

# లా గ్రాడ్యుయేట్లకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్..

హైదరాబాద్ : జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల అర్హత విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. న్యాయవాదిగా కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలన్న నిబంధనను సడలించిన ధర్మాసనం, ఇకపై ఏడాది పాటు ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉంటే సరిపోతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఏజీ మసీహ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం 2:1 మెజారిటీతో ఈ తీర్పును వెలువరించింది. అయితే, జస్టిస్ వినోద్ చంద్రన్ ఈ తీర్పుతో విభేదించారు. చీవషంజూఖజూవతీం గతంలో 2025 మే నెలలో ఇచ్చిన తీర్పు ప్రకారం, జడ్జి పరీక్ష రాయాలంటే లా గ్రాడ్యుయేట్లకు మూడేళ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ ఉండటం తప్పనిసరి. తాజా తీర్పుతో ఈ నిబంధన మారింది. ఇకపై ఏడాది అనుభవం ఉన్నవారు ప్రిలిమినరీ స్థాయి జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరుకావచ్చు. అయితే, ప్రవేశ నిబంధనలను సడలించినప్పటికీ, ఎంపికైన అభ్యర్థులకు కఠినమైన శిక్షణ ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షలో ఎంపికైన వారు రెండేళ్ల పాటు ప్రత్యేక శిక్షణ, పర్యవేక్షణలో ఉండాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఏడాది పాటు జ్యుడీషియల్ అకాడమీలో సమగ్ర శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత మరో ఏడాది పాటు క్లర్క్‌షిప్ చేయాలి. దీనిలో మొదటి ఆరు నెలలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్/జిల్లా సెషన్స్ జడ్జి వద్ద, తర్వాతి ఆరు నెలలు హైకోర్టు జడ్జి వద్ద పనిచేయాల్సి ఉంటుంది. ఈ రెండేళ్ల కాలంలో వారి పనితీరును అంచనా వేసిన తర్వాతే తుది నియామకాన్ని ఖరారు చేస్తారు.



తెలుగు దినపత్రిక
# దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

ఆగస్టు । ఆదివారం । 23 । 2026



## అదుపులో ఆరుగురు నాటుసారా తయారీపై ఉక్కుపాదం..





**1,500 లీటర్ల పానకం ధ్వంసం.. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం**

**నాటుసారా తరలింపునకు వినియోగించిన రెండు బైక్‌లు సీజ్**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 22**

నాటుసారా తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించేందుకు మహబూబాబాద్ జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి. ఐపీఎస్ ఆదేశాల మేరకు మరిపెడ సీ.ఐ. ఎల్. పవన్ కుమార్ ఆధ్వర్యంలో మరిపెడ మండలం సోమ్లా తండాలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లు, నాటుసారా తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

**అనుమానిత ఇళ్లు, స్థావరాల్లో తనిఖీలు**

సోమ్లా తండాలో పోలీసు బృందాలు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఈస్ట్, చక్కెరను ఉపయోగించి నాటుసారా తయారు చేస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 1,500 లీటర్ల ఈస్ట్, చక్కెర కలిపిన పానకాన్ని గుర్తించిన పోలీసులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే తయారు చేసిన 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.నాటుసారాను తరలించేందుకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యానికి, గ్రామీణ సమాజానికి హాని కలిగించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు.

**చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు**

ఈ సందర్భంగా మరిపెడ సీ.ఐ .ఎల్. పవన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాటుసారా, మత్తు పదార్థాల వల్ల కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు ఏర్పడటమే కాకుండా ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు, నాటుసారా తయారీ, విక్రయాలు, మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని గ్రామస్తులను కోరారు.

**సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన**

కార్డన్ సెర్చ్ అనంతరం గ్రామస్తులతో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీ.ఐ. పవన్ కుమార్ సూచించారు. అపరిచిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు, సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను వివరించి యువతను వాటికి దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

**పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి**

ఇంట్లో పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సీ.ఐ సూచించారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు, ఎలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు, వారి రోజువారీ ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తున్నాయా అనే విషయాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలని చెప్పారు. పిల్లలకు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు కోరారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్, చిన్నగూడూరు ,ఎస్ఐ కుశకుమార్, సీరోల్ ఎస్ఐ సంతోష్, పాటు సుమారు 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సోమ్లా తండాలో చేపట్టిన కార్డన్ సెర్చ్‌తో నాటుసారా తయారీదారుల్లో ఆందోళన నెలకొనగా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు.

## భూ దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం యత్నం: పువ్వాడ అజయ్‌కుమార్






**ఖమ్మం, ఆగస్టు 22 (దేశ టైమ్స్):**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూభారతి పేరుతో భూదోపిడీకి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.22ఏ నిషేధిత భూములు గతంలో 8--9 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పుడు కోటి ఎకరాలకు ఎలా పెరిగాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ వంద శాతం పూర్తయిందని చెబుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.సీతారామ ప్రాజెక్టు, నీటి సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు.తాను మంత్రిగా ఉన్న సమయంలో 23 ఎకరాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, కేబినెట్ ఆమోదంతో జీవో జారీ చేయించామని తెలిపారు. ఆ స్థలాలను జర్నలిస్టులకు కేటాయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రజల ఆస్తులు, రైతుల సమస్యలు, పేదల ఇళ్లు, జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## అంబేద్కర్‌పై కల్పిత రాతలు రాస్తే చరిత్ర క్షమించదు: సంగిశెట్టి క్రిస్టఫర్

**వలిగొండ, ఆగస్టు 22 (దేశ టైమ్స్)**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అవగాహన లేకుండా, కల్పిత విషయాలతో రచనలు చేయాలని చూస్తే హమారా ప్రసాద్‌ను చరిత్ర క్షమించదని, ప్రజలు కూడా క్షమించరని ఫ్రీడమ్ ఫైటర్, సామాజిక కార్యకర్త సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, హమారా ప్రసాద్ కల్పిత రాతలు రాయడం సరికాదన్నారు. అంబేద్కర్ మహానీయుడి చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తే అవి కాలగర్భంలో కలిసిపోవడం కాయమని క్రిస్టఫర్ అన్నారు.



## ఆత్మ బడ్జెట్‌తో రైతులకు మరింత ప్రయోజనం కల్పించాలి

**శిక్షణలు, ఫామ్ స్కూల్స్, డిమాండ్ సెషన్ల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక**

**వచ్చే వారంలో కార్యక్రమాలు పూర్తి చేయాలని ఏ.డి.ఏ పి. మురళి సూచన**

**దేశ టైమ్స్ మహబూబాబాద్ మరిపెడ ఆగస్టు 22**




రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆత్మ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. మరిపెడ ఏ.డి.ఏ కార్యాలయంలో ఆత్మ కమిటీ సభ్యులు, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు సమావేశమై ఆత్మ బడ్జెట్‌పై ప్రణాళికను రూపొందించారు.ఈ సందర్భంగా ఆత్మ బడ్జెట్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు, కమిటీ సభ్యులు చర్చించారు. రైతులకు ఉపయోగపడే విధంగా శిక్షణ కార్యక్రమాలు, ఫామ్ స్కూల్స్, డిమాండ్ సెషన్స్ నిర్వహించేందుకు మండలాల వారీగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా కార్యక్రమాలను నెలల వారీగా విభజించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు.

వచ్చే వారంలో పూర్తి చేయాలి

ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మురళి మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయంపై అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణలు, ఫామ్ స్కూల్స్, డిమాండ్ సెషన్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రూపొందించిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలను వేగవంతం చేసి, వచ్చే వారంలో అన్ని శిక్షణ కార్యక్రమాలు, డిమాండ్ సెషన్స్‌ను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతుల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని, ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆత్మ కార్యక్రమాల ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్లు, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాల తర్వాత ఎస్టీ నాయకుడికి కాంగ్రెస్ పగ్గాలు

- **మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుగులోతు రవినాయక్**

**(దేశ టైమ్స్) మహబూబాబాద్ మరిపెడ/ఆగస్టు 22**



డోర్నకల్ నియోజకవర్గ రాజకీయ చరిత్రలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో తొలిసారిగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి దక్కింది. గుగులోతు రవినాయక్‌ను మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించడంతో ఎస్టీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటివరకు మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి అవకాశం దక్కలేదని పలువురు ఎస్టీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎస్టీ వర్గాలకు చెందిన నాయకుల్లో ఒకరికి మండల స్థాయి కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలను గుగులోతు రవినాయక్‌కు అప్పగించడం ద్వారా ఎస్టీ వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం లభించిందని నాయకులు పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతోపాటు ఎస్టీ, బీసీ, ఎస్సీ, మైనార్టీ తదితర అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ఈ నియామకం దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ చొరవతో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి ఈ కీలక బాధ్యతలు దక్కాయని ఎస్టీ వర్గాల నాయకులు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా దక్కని అవకాశం ఇప్పుడు లభించడం పట్ల ఎమ్మెల్యేకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రవినాయక్‌కు బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ నాయకత్వం అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తుందనే నమ్మకం మరింత బలపడిందన్నారు.

## మత్స్యాద్రి నుండి దిల్ సుఖ్ నగర్ వరకు నూతన బస్సు ప్రారంభం

**వలిగొండ, ఆగస్టు 22 (దేశ టైమ్స్)**



మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం మత్స్యగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌లోని దిల్ సుఖ్ నగర్ వరకు నూతన బస్సు సర్వీసును శనివారం ప్రారంభించారు. పలుమార్లు హైదరాబాద్ డిపో మేనేజర్ కు, అధికారులకు స్థానిక నాయకులు, కాలనీ వాసులు వినతి పత్రాలు అందించడంతో ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని మత్స్యగిరి గుట్ట దేవస్థానం చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లతో కలిసి నూతన బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి

- ఫారం పాండ్లతో వర్షపు నీటి సంరక్షణకు ప్రోత్సాహం: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (దేశ టైమ్స్):**

రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి కుంట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి కుంటల నిర్మాణంతో వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకోవచ్చని అన్నారు. నిల్వ చేసిన నీరు క్రమంగా భూమిలోకి ఇంకడం ద్వారా సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటి లభ్యత పెరగడంతో భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణ వివరాలు, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రియాక్టర్ పేలుడు ఘటనపై ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆగ్రహం.

**(యాదాద్రి కరస్పాండెంట్ )దేశటైమ్స్, ఆగష్టు 22.**



భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలో ని దోతిగూడెంగ్రామం లో హేజిలో పార్మా కంపెనీలో రియాక్టర్ పేలి కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ ప్రమాదంలో గాంధీ ఆసుపత్రిలో ఇద్దరు మృతి చెందగా, మరికొందరు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కంపెనీలు భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కంపెనీల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచించారు.

## బీసీ కుల గణన చేపట్టాలి: జాజుల శ్రీనివాస్ గౌడ్

**వలిగొండ, ఆగస్టు 22 (దేశ టైమ్)**




బీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ జాబితా లేకపోవడంతో కొంత మంది గోత్రం ఇంటి పేరు చెప్పిన పరిస్థితి నెలకొందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా ఇస్తున్నారని బీసీలకు జనాభా ప్రతిపాదన వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం బీసీ కులాల గణనకు వ్యతిరేకమని విమర్శించారు. నవంబర్ లో లక్ష మందితో పార్లమెంటు ముట్టడిస్తామన్నారు. బీసీ నాయకులు అంతా ఐకమత్యంతో ఉండాలని సూచించారు. స్పష్టమైన బీసీ కులాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆగస్ట్ 25న దేశవ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిని యాదగిరి, నానాచర్ల రమేష్, వరికుప్పల మధు, జాజుల లింగం గౌడ్, తాడికొండ విక్రం, నరేష్, బాబు, స్వామి, గూడూరు భాస్కర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# మీరు పంపిన సమాచారాన్ని వార్తా కథనంగా, పత్రికా శైలిలో కుదించి, శీర్షిక--ఉపశీర్షికలతో ఇలా రూపొందించవచ్చు






**ప్రతి చిన్నారికి భద్రమైన బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత**

**విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు**

**గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై పాఠశాలల్లో విస్తృత అవగాహన అవసరం**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (దేశ టైమ్స్):**

ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు అన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే చట్టాలు, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం--2024' కింద బాలల సంరక్షణ అధికారుల కోసం నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నాగరాజు మాట్లాడుతూ, తల్లి కోడి తన పిల్లలను రెక్కల కింద కాపాడుకున్నట్లే ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలని సూచించారు. పాఠశాలల్లో చిన్నారులకు లి'గుడ్ టచ్--బ్యాడ్ టచ్'లిపై వయసుకు తగిన రీతిలో అవగాహన కల్పించాలన్నారు. అనవసరమైన స్పర్శను గుర్తించి వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేసే ధైర్యాన్ని పిల్లల్లో పెంపొందించాలన్నారు.

**పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించాలి**

విద్యార్థుల్లో భయం, ఒంటరితనం, ఆందోళన వంటి అసాధారణ మార్పులు కనిపిస్తే ఉపాధ్యాయులు వాటిని నిశితంగా గమనించాలని సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా టీచర్లు వ్యవహరించాలన్నారు. బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై వేధింపులు వంటి ఘటనలపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. 'మొక్కై వంగనిది.. మానై వంగునా..' అనే సామెతను గుర్తు చేస్తూ బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పడం ఎంతో అవసరమని అన్నారు. బాల్యాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దితేనే పిల్లల భవిష్యత్తుతో పాటు సమాజ భవిష్యత్తు కూడా బాగుంటుందని పేర్కొన్నారు.

చట్టాలపై అధికారులకు నిరంతర అవగాహన అవసరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సమాజం వేగంగా మారుతున్న నేపథ్యంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయని అన్నారు. అధికారులు చట్ట పరిధిని, తాజా నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. చట్టాల అమలు క్షేత్రస్థాయిలోనే స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని, అందువల్ల ప్రాథమిక స్థాయిలో పనిచేసే సిబ్బందికి చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణలో ఎలాంటి అలసత్వానికీ తావులేదని స్పష్టం చేశారు. జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం తదితర చట్టాలను బాధ్యతాయుతంగా అమలు చేసి ప్రతి బిడ్డకు సురక్షిత వాతావరణం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణు వందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, బాలల సంరక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షైన్ హైస్కూల్‌లో ఘనంగా గ్రీన్ ప్లాంటేషన్ డే





**మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ సాధ్యం: కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా**

**ఖమ్మం ప్రతినిధి ఆగష్టు 23(దేశ టైమ్స్ )**

మండల పరిధిలోని స్థానిక షైన్ హైస్కూల్‌లో శనివారం గ్రీన్ ప్లాంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని అన్నారు. మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన, కాలుష్యరహితమైన గాలిని పొందడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాలని, వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. నేడు నాటే మొక్కలు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సురవరం సుధాకర్ రెడ్డి వర్ధంతి

**వలిగొండ, ఆగస్టు 22 (దేశ టైమ్స్)**

మాజీ పాట్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో సీపీఐ మండల కమిటి ఆధ్వర్యశీలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండి రాజకీయాలు అలవర్చుకొని దేశ, రాష్ట్ర రాజకీయాలలో కీలక భూమిక పోషించారని, బడుగు, బలహీన వర్గాల ఆశజ్యోతిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్లమెంట్ సభ్యులుగా నిలిచారు ఈ ప్రాంత త్రాగు సాగు, నీరుకై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించిన నాయకునిగా పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, రైతు సంఘం నాయకులు ఎలగందుల అంజయ్య, శీలం స్వామి, సల్వద్రి రవీందర్, బాలాగోని సత్యనారాయణ, పోలెపాక యాదయ్య, నరిగే యాదయ్య, సుద్దాల సాయి కుమార్, బొడిగె సుదర్శన్, మచ్చ లక్ష్మి నారాయణ, తాలుక యాదగిరి ,సలి గంజి మచ్చ గిరి, ఎడవెల్లి వేణు, యాదమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280